ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5 జిల్లా వార్తలు
ఆదివారం 18 ఫిబ్రవరి 2024

మహేశ్వరం ఏసీపీగా బాధ్యతల స్వీకరణ




మహేశ్వరం, ఫిబ్రవరి 17 : మహేశ్వరం ఏసీపీగా ఉమామహేశ్వరరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోన్ పరిధిలో సాంకేతికతను ఉపయోగించి క్రైం రేటు తగ్గిస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లు ఏసీపీని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

కార్పొరేట్ మాయ!

పరీక్షలకు ముందే కాలేజీల్లో అడ్మిషన్లు

- నిబంధనలు గాలికి.. ఇంటర్ కాలేజీల ఇష్టారాజ్యం
- పది పరీక్షలకు నెలల ముందే అడ్మిషన్ ప్రక్రియ
- పీఆర్వోలతో తల్లిదండ్రులకు ఫోన్లు
- పట్టించుకోని ఇంటర్ బోర్డు అధికారులు

ఎప్పటిలాగానే ఈ సారీ ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీలు ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తూ ఫీజుల దందాకు తెరలేపాయి. ఇంకా పదో తరగతి వార్షిక పరీక్షలు అవనే లేదు. ఇప్పటికే అడ్మిషన్ ప్రక్రియ మొదలు పెట్టాయి. పెద్దపెద్ద ఫ్లెక్సీలు, వాల్‌పోస్టర్లు, పాంప్లెట్లతో ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఇంటర్ బోర్డు అకాడమిక్ అడ్మిషన్ తేదీలను వెలువరించకుండా ముందస్తుగా అడ్మిషను తీసుకోవడం నిబంధనలకు విరుద్ధం. ఇదిలా ఉంటే ఏటా ఫీజులు కూడా వేలల్లో పెంచుతున్నారు. ఇప్పుడే అడ్మిషన్లు తీసుకుంటే ఫీజులో రాయితీ ఇస్తామంటూ కాలేజీల నిర్వాహకులు విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తున్నారు. ఇంత జరుగుతున్నా ఇంటర్ బోర్డు అధికారులు, ప్రభుత్వం చర్యలేమీ తీసుకోవడం లేదు.



ఏప్రిల్/మే నెలల్లో ఇంటర్ అడ్మిషన్ నోటిఫికేషన్

వాస్తవానికి పదో తరగతి పరీక్షలు ముగిసి, ఫలితాలు వెల్లడించిన తర్వాతే ఇంటర్‌బోర్డు ఫస్టియర్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్‌ను జారీ చేస్తుంది. ఇది ప్రభుత్వ కాలేజీలతో పాటు ప్రైవేట్ కాలేజీలకు సైతం వర్తిస్తుంది. అప్పుడే ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లు తీసుకోవాలి. యేటా ఏప్రిల్ లేదా మే నెలలో నోటిఫికేషన్ వస్తుంది. కానీ కార్పొరేట్ కాలేజీలు ముందుగానే అడ్మిషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నాయి. అడ్వాన్స్ బుకింగ్ పేరిట భారీగా వసూళ్లు చేస్తున్నారు. ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధమైనా.. ఇంటర్ బోర్డు అధికారుల పర్యవేక్షణ లోపం.. ప్రభుత్వం కాలేజీలను అదుపుచేసే పరిస్థితి లేకపోవడంతో ఇలా జరుగుతోందని విద్యార్థి సంఘాలు వాపోతున్నాయి

అక్రమాలకు ఆన్‌లైన్‌తోనే చెక్!

రాష్ట్రంలో ఇంటర్ కార్పొరేట్ కాలేజీలు సాగిస్తున్న ఈ అక్రమ దందాకు ఆన్‌లైన్ ప్రవేశ ప్రక్రియ ఒక్కటే పరిష్కారం అని విద్యావేత్తలు, మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఆన్‌లైన్ విధానంతోనే ఫీజుల దందాకు చెక్ పెట్టొచ్చని చెబుతున్నారు. ఇప్పటికే 'దోస్త్' ద్వారా డిగ్రీ కోర్సుల్లో ఆన్‌లైన్ అడ్మిషన్లు విజయవంతంగా చేపడుతున్నారు. ఎంసెట్ సహా అనేక వృత్తి విద్యా కోర్సుల్లో సీట్ల భర్తీకి ఆన్‌లైన్ ద్వారానే నిర్వహిస్తున్నారు. ఇంటర్ లోనూ ఇదే తరహా అడ్మిషన్ల విధానాన్ని చేపడితే బాగుంటుందని నిపుణులు సూచిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 17

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని ఇంటర్మీడియట్ ప్రవేశాల్లో కార్పొరేట్ కాలేజీల మాయ మొదలైంది. ఇంకా పదో తరగతి పరీక్షలు పూర్తి కాకముందే పలు కాలేజీల్లో ఇప్పటికే 2024-25 విద్యాసంవత్సరానికి ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు 90శాతం పూర్తవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. ముఖ్యంగా కార్పొరేట్ కాలేజీలు.. సీట్లు అయిపోతున్నాయంటూ కృత్రిమ డిమాండ్‌ను సృష్టించి సొమ్ము చేసుకుంటున్నాయి. అడ్వాన్స్‌డ్ బుకింగ్ పేరుతో సీట్లను బ్లాక్ చేస్తున్నాయి. ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. ఈ ఏడాది ఇంకా పదో తరగతి పరీక్షలు పూర్తికాక ముందే, ఇంటర్ విద్యకు వచ్చే విద్యా సంవత్సరానికి అడ్మిషన్ నోటిఫికేషన్ వెలువడకముందే కొన్ని కార్పొరేట్, ప్రైవేట్ ఇంటర్ కాలేజీలు అడ్మిషన్లు చేపట్టాయి. ఇది నిబంధనలకు విరుద్ధం. రాయితీల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రులను వలవేస్తూ ముందస్తు 'సీట్ల' దందాకు తెరలేపాయి. రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో కొన్ని ఇంటర్ కాలేజీలు జనవరిలోనే అడ్మిషన్లు ప్రారంభించాయి. వివిధ ప్రసార మాధ్యమాలు, పోస్టర్లు, పాంప్లెట్లతో ప్రచారాన్ని ఉధృతం చేస్తున్నాయి. పదో తరగతి పరీక్షలు పూర్తి కాకముందే ప్రైవేట్ కాలేజీల్లో 2024-25 అకడమిక్ ఇయర్‌కు ఇంటర్ ఫస్టియర్ అడ్మిషన్లు ప్రారంభించాయి. ఆయా కాలేజీల పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ల(పీఆర్వో)లతో రోజూ విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేయిస్తున్నారు. మీరు ముందుగా అడ్మిషన్లు తీసుకుంటే ఫీజు రాయితీ ఇస్తామని, పదో తరగతి ఫలితాల తర్వాత ఈ రాయితీ ఉండదంటూ చెబుతున్నారు. తర్వాత సీట్లు ఉండవని, ఇప్పుడు బుక్ చేసుకోకుంటే ఫీజు తగ్గించడం కుదరదని కాలేజీల యాజమాన్యాలు డిమాండ్‌ను సృష్టించి సొమ్ము చేసుకుంటున్నాయి. కొన్ని ప్రాంతాల్లో బైపీసీ(నీట్)కి సీట్లు ఇప్పటికే నిండిపోయాయి. అడ్వాన్స్‌డ్ బుకింగ్ పేరిట తల్లిదండ్రుల నుంచి రూ.5వేల నుంచి 10వేల వరకు కార్పొరేట్ కాలేజీలు వసూలు చేస్తున్నాయి. మంచి కాలేజీల్లో సీట్లు దొరకవేమోనన్న భయంతో తల్లిదండ్రులు కాలేజీలు చెప్పినంత చెల్లించి వారి పిల్లలకు సీట్లు ఖరారు చేసుకుంటున్నారు. ఈ దందాను అరికట్టాలని ఇంటర్‌బోర్డు అధికారులను విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నారు.

ఇంటర్ పరీక్షలు ఇలా..

ఇంటర్ వార్షిక పరీక్షలు ఫిబ్రవరి 28 నుంచి మార్చి 18వ తేదీ వరకు నిర్వహిస్తారు. ఈనెలలో ప్రాక్టికల్ పరీక్షలు జరుగనున్నాయి. పది పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరుగనున్నాయి.

ఇంటర్మీడియట్ అధికారులు పట్టించుకోవడం లేదు



పదో తరగతి పరీక్షలు జరగకముందే కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలు ఫస్టియర్‌లో అడ్మిషన్లు ప్రారంభించారు. ఇలా ఇష్టారాజ్యంగా అడ్మిషన్లు తీసుకుంటున్నా ఇంటర్ బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్‌చేసి మరీ 'మా కాలేజీలో చేర్పించండి.' అని కాలేజీల నిర్వాహకులు ఒత్తిడి చేస్తున్నారు. నిబంధనలు పాటించని కార్పొరేట్/ప్రైవేట్ కాలేజీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ప్రైవేట్ కళాశాలల ఆగడాలను అదుపు చేయడంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారులు విఫలమయ్యారు. ఏటా 10-20 శాతం ఫీజులు పెంచుతున్నారు. బుక్స్ పేరిట దందా కొనసాగిస్తున్నారు. అడ్మిషన్ సమయంలో డిపాజిట్ పేరిట వసూలు చేస్తున్న డబ్బులు విద్యార్థులకు తిరిగి ఇవ్వడం లేదు.

\- శంకర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి

నాకు రోజూ ఫోన్లు వస్తున్నాయి



నా కూతురు పదో తరగతి చదువుతోంది. ఇంకా పరీక్షలే కాలేదు. కానీ ప్రైవేట్ కాలేజీల నుంచి అడ్మిషన్ల కోసం ఫోన్‌కాల్స్ వస్తున్నాయి. 'ఇప్పుడే బుక్ చేసుకుంటే ఫీజులో 10-15శాతం కన్సేషన్ ఇస్తాం. ఇప్పుడు బుక్ చేసుకోకుంటే తర్వాత మొత్తం ఫీజు చెల్లించాలి.' అని చెబుతున్నారు. కార్పొరేట్ కాలేజీలు ఇలా అడ్మిషన్ల దందా చేస్తున్నా.. ఇంటర్ బోర్డు అధికారులు పట్టించుకోవడం లేదు. ఇష్టానుసారం ఫీజులు వసూళ్లు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేట్ కాలేజీలపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

\- పి.యాదయ్య, కొందుర్గు

కార్పొరేట్ కాలేజీల్లో ఫీజులను నియంత్రించాలి



ప్రైవేట్ ఇంటర్ కాలేజీల్లో ఫీజులను నియంత్రించాలి. ఏటా వేలల్లో ఫీజు పెంచుతున్నారు. ప్రభుత్వం గానీ, అధికారులు గానీ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ ఇంటర్ కాలేజీల్లో నాణ్యమైన విద్య అందించకపోవడతోనే వారి పిల్లలను ప్రైవేట్, కార్పొరేట్‌లో చదివించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వ కాలేజీల్లో బాగా చదువు చెబితే ప్రైవేట్‌కు వెళ్లాల్సిన పనే లేదు. దీన్ని ఆసరాగా చేసుకొనే కార్పొరేట్ కాలేజీలు ఇష్టం వచ్చినట్టుగా వ్యవహరిస్తున్నాయి.

\- రమేష్, పద్మారం, చౌదరిగూడ మండలం



రథాన్ని లాగుతున్న భక్తులు

మక్తమాదారంలో ఘనంగా రథోత్సవం

కడ్తాల్, ఫిబ్రవరి 17: మక్తమాదారంలోని వేణుగోపాల స్వామి దేవాలయం వద్ద రథోత్సవ కార్యక్రమాన్ని శనివారం తెల్లవారు జామున అట్టహాసంగా నిర్వహించారు. స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో మక్తమాదారంతో పాటు సమీప గ్రామాల ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రథాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. రథంపై దేవతామూర్తుల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించగా, భక్తులు తాళ్లతో లాగి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయంలో దేవాలయ ధర్మకర్త, అర్చకులు శ్రీ వింజమూరి రామానుజాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, ఎంపీటీసీ సభ్యురాలు మంజుల చంద్రమౌళి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలతో చీడపీడల నివారణ



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

మంచాల, ఫిబ్రవరి 17 : సరైన సమయంలో సస్యరక్షణ చర్యలు చేపడితే చీడపీడల నుంచి వరిచేలను కాపాడవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ పద్మావతి పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ, సేవాస్ఫూర్తి ఫౌండేషన్ సంయుక్తంగా మంచాల మండలం బోడకొండలో వరిలో చీడపీడలు-సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ లింగాకర్షక బుట్టల ఏర్పాటుతో వరి చేలను మొగిపురుగు బెడదనుంచి కాపాడవచ్చన్నారు. యాసంగిలో మొగిపురుగు ఉధృతి ఎక్కువగా ఉండే అవకాశముందన్నారు. కార్యక్రమంలో సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్, వ్యవసాయ విస్తరణ అధికారి సరిత పాల్గొన్నారు.

ఈ నెల 20న జడ్పీ సమావేశం

రంగారెడ్డి అర్బన్, జనవరి 17 : ఈనెల 20న జడ్పీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు జడ్పీ సీఈవో సీహెచ్ కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జడ్పీ చైర్‌పర్సన్ తీగల అనిత అధ్యక్షతన మంగళవారం ఉదయం 11 గంటలకు సమావేశం జరుగుతుందని, అధికారులు పూర్తి సమాచారంతో సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

అంతర్జాతీయ సదస్సుకు ఆహ్వానం

షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డికి అవకాశం



షాద్‌నగర్, ఫిబ్రవరి 17 : 'సాంకేతిక విద్య, నూతన విద్యా విధానం' అనే అంశంపై నిర్వహించే అంతర్జాతీయ సదస్సులో పాల్గొనేందుకు షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ రవీందర్‌రెడ్డికి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ నెల 25, 26వ తేదీల్లో న్యూ ఢిల్లీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఇంటర్‌నేషనల్ ఆడిటోరియంలో జరిగే 'రిసర్జెంట్ భారత్ ఆఫ్‌ది గ్లోబల్' అనే అంశంపై యూనివర్సిటీ ఆఫ్ ఢిల్లీ అనుబంధ శివాజీ కళాశాల ఆధ్వర్యంలో శైక్షిక్ ఫౌండేషన్ సంస్థ నిర్వహిస్తున్న అంతర్జాతీయ సదస్సులో వివిధ దేశాల నుంచి ఎంపికైన అధ్యాపకులు కూడా పాల్గొననున్నారని తెలిపారు. ఈ సందర్భంగా తాను దేశంలో అమల్లోకి వస్తున్న నూతన విద్యా విధానంపై ఇంప్లిమెంటింగ్ న్యూ ఎడ్యుకేషన్ పాలసీ 2020త్రూ గవర్నెన్స్ అండ్ టెక్నాలజీ అనే అంశంపై పరిశోధన పత్రాన్ని సమర్పించబోతున్నానని తెలిపారు. పాలమూరు యూనివర్సిటీకి అనుబంధంగా ఉన్న షాద్‌నగర్ డిగ్రీ కళాశాల నుంచి తాను అంతర్జాతీయ సదస్సులో పాల్గొనబోతున్నందుకు సంతోషంగా ఉందని రవీందర్‌రెడ్డి తెలిపారు. జాతీయ స్థాయి సదస్సుకు వెళ్తున్న ఆయనను అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

సఫాయి కర్మచారుల జీవన ప్రమాణాలు మెరుగు పరచాలి

రంగారెడ్డి అర్బన్, జనవరి 17 : సఫాయి కర్మచారుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను సక్రమంగా అమలు చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగు పర్చేందుకు అన్ని చర్యలు చేపట్టాలని సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ చైర్మన్ ఎమ్.వెంకటేశం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. సఫాయి కర్మచారుల కోసం జిల్లా యంత్రాంగం అమలు చేస్తున్న పథకాల పురోగతిపై జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, జిల్లా అధికారులు, జీహెచ్ఎంసీ అధికారులు, మున్సిపల్ కమిషనర్‌లతో సమావేశం నిర్వహించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సఫాయి కర్మచారులకు పునరావాసం కల్పించడం, ప్రభుత్వ పథకాలు వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో సఫాయి కర్మచారులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో మున్సిపల్ కార్పొరేషన్లలో, మున్సిపాల్టీలలో పని చేస్తున్న సఫాయి కర్మచారులకు వేతన స్లిప్, పీఎఫ్, ఈఎస్ఐ, బీమా అందిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్లు తెలిపారు. సఫాయి కర్మచారులు అశుభ్రమైన ప్రాంతాలలో పారిశుధ్య పనులు చేయడం వలన వారికి అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయన్నారు. వీరు నివసించే ప్రాంతాలలో సంవత్సరానికి రెండుసార్లు తప్పనిసరిగా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. సఫాయి కర్మచారులకు ఉపాధి కల్పనలో ప్రత్యేక చొరవ తీసుకోవాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, పోలీస్ స్టేషన్లలో కర్మచారులను నియమించి ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలను అందించాలని ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని సంక్షేమ పథకాలు వారు సద్వినియోగపర్చుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మహిళా కార్మికులకు ప్రత్యేకమైన కమిటీని ఏర్పాటు చేసి వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని తెలిపారు. సఫాయి కర్మచారులకు ప్రధానమంత్రి బీమా యోజనపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ



మాట్లాడుతున్న సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ చైర్మన్ వెంకటేశం

సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, సైబరాబాద్ డీసీపీ (క్రైం) నర్సింహులు, జిల్లా పరిషత్ సీఈవో కృష్ణారెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి రామారావు, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, జిల్లా మైనార్టీ శాఖ అధికారి నవీన్‌రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి రామేశ్వరీ దేవి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు, మున్సిపల్ కమిషనర్లు, ఎల్డీఎం కుసుమ, సఫాయి కర్మచారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు జిల్లా కలెక్టరేట్‌కు చేరుకున్న సఫాయి కర్మచారుల జాతీయ కమిషన్ చైర్మన్ ఎం.వెంకటేశానికి జిల్లా కలెక్టర్ కె. శశాంక, జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, సైబరాబాద్ డీసీపీ (క్రైం) నర్సింహులు తదితరులు కలిసి ఘనంగా స్వాగతం పలికారు.

వ్యాయామ విద్యపై శ్రద్ధ ఏదీ?

- విద్యార్థులకు ఆటస్థలాలు కరువు
- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు
- గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం కలేనా
- సౌకర్యాల కోసం తప్పని ఎదురుచూపులు

కందుకూరు, ఫిబ్రవరి 17 : మానవ వికాసానికి చదువు ఎంత ముఖ్యమో, శారీరక వికాసానికి ఆటలూ అంతే ముఖ్యం. అందుకే అన్ని పాఠశాలల్లో పాఠ్య ప్రణాళికతో పాటు ఆటలను కూడా భాగం చేశారు. ఆటలు ఆడించాలంటే పాఠశాలల్లో పీఈటీలు తప్పనిసరిగా ఉండాలి. కానీ కందుకూరు మండల పరిధిలో దానికి పూర్తి విరుద్ధంగా ఉంది. అయినా, పాలకులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. కొత్త ప్రభుత్వంలోనైనా వ్యాయామ విద్యకు ప్రోత్సాహం లభిస్తుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. చదువంటే పుస్తకాలకే పరిమితం కాదని క్రీడలు కూడా భాగమేనని పలువురు చెబుతున్నారు. ప్రభుత్వాలు మాత్రం ఆచరణలో పూర్తిగా నిర్లక్ష్యం చూపుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తిస్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయకపోవడమే దీనికి నిదర్శనమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. కందుకూరు మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో 11 ఉన్నత, 12 ప్రాథమికోన్నత, 30 ప్రాథమిక పాఠశాలలున్నాయి. వీటిలో ఈ విద్యాసంవత్సరం 4,315 మంది విద్యార్థులు చదువుతున్నారు. కందుకూరు (బాలురు), నేదునూరు, మీర్ఖాన్‌పేట, ఆకులమైలారం, పులిమామిడి, తిమ్మాపురం గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలకు ప్రభుత్వం పీఈటీల పోస్టులను మంజూరు చేయగా, కస్తూర్బాగాంధీ బధిరుల పాఠశాలతో పాటు, నేదునూరులో ఉన్న ఆదర్శ పాఠశాలల్లో కాంట్రాక్టు బేసిక్‌పై పీఈటీలు పని చేస్తున్నారు. మిగతా పాఠశాలలకు ప్రభుత్వం వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులనే మంజూరు చేయలేదు.

ఉన్నత పాఠశాలల్లో పీఈటీ పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల గేమ్స్ పీరియడ్‌లో కూడా క్లాసు రూముల్లోనే ఉండాల్సి వస్తున్నదని విద్యార్థులు వాపోతున్నారు. వెంటనే భర్తీ చేయాలని వారు కోరుతున్నారు.

నిరుపయోగంగా మినీ స్టేడియం

మండల కేంద్రంలో (కొత్తగూడ)లో క్రీడాకారులకు ప్రోత్సాహం కోసం గత ప్రభుత్వం నిర్మించిన మినీ స్టేడియంలో పిచ్చిమొక్కలు పెరిగాయి. రూ.లక్షలు వెచ్చించి నిర్మించిన మినీస్టేడియం నిర్వహణను పట్టించుకోకపోవడం దారుణమని స్థానికులు విమర్శిస్తున్నారు. పాఠశాలల్లో క్రీడామైదానాలు లేని వారు సెలవు రోజుల్లోనైనా ఆటలు ఆడుకోవడానికి మినీ స్టేడియాన్ని చదును చేయాలని పలువురు కోరుతున్నారు.



జిల్లాస్థాయి ఖోఖో క్రీడల్లో పాల్గొన్న నేదునూరు పాఠశాల క్రీడాకారులు(ఫైల్)



మండల కేంద్రంలో మినీ స్టేడియం మైదానం, అసంపూర్తిగా ఉన్న ప్రహరీ

రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణించిన మండల వాసులు

మండలంలోని రాచులూరు గ్రామానికి చెందిన నలుగురు క్రీడాకారులు గతంలో జాతీయ, రాష్ట్రస్థాయి క్రీడల్లో రాణించారు. రాచులూరుకు చెందిన వెదిరె నర్సింగంరెడ్డి, వెదిరె శ్రీదేవి, వెదిరె శ్రీకాంత్‌రెడ్డి 1980కి ముందు రాష్ట్రస్థాయి వాలీబాల్‌లో పోటీల్లో పాల్గొన్నారు. ఆ సమయంలో రాష్ట్ర జట్టుకు శ్రీకాంత్‌రెడ్డి కెప్టెన్‌గా వ్యవహరించారు. అదే గ్రామానికి చెందిన వెదిరె రవికాంత్‌రెడ్డి 1990లో జాతీయ వాలీబాల్ పోటీల్లో పాల్గొని.. 2002లో అర్జున అవార్డు పొందారు. కందుకూరు మండలంలోని క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం అందిస్తే మరింతమంది రాష్ట్ర, జాతీయస్థాయిలో రాణిస్తారని క్రీడాకారులు చెబుతున్నారు.

గ్రామీణ క్రీడాకారుల సమస్యలను పట్టించుకోవాలి



గ్రామీణ క్రీడాకారుల సమస్యలను ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. వారికి ప్రోత్సాహం కల్పించడానికి ప్రతీ మూడు నెలలకోసారి మండల స్థాయి క్రీడలను నిర్వహించాలి. వాటిలో రాణించే వారిని గుర్తించి జిల్లా స్థాయికి పంపించాలి. గ్రామీణ స్థాయిలో విద్యార్థులు, యువకులు ఆడుకోవడానికి సరైన క్రీడా స్థలాలు లేకపోవడంతోచాలామంది క్రీడలకు దూరమవుతున్నారు. చిన్నప్పటి నుంచే పిల్లల్లో క్రీడలపై ఆసక్తిని కలిగిస్తే వారు మరింత రాణిస్తారు. కానీ, ప్రభుత్వాలు ఆ వైపుగా ఆలోచన చేయడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామీణ ప్రాంతాల్లో క్రీడా మైదానాలను నెలకొల్పడంతో పాటు పాఠశాలల్లో కూడా పీఈటీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

\- కందడి శ్రీరాం, కందుకూరు

మినీ స్టేడియాన్ని అందుబాటులోకి తేవాలి



మండల స్థాయిలోని మినీ స్టేడియాన్ని క్రీడాకారులకు అందుబాటులోకి తీసుకు రావాలి. వ్యాయామ విద్యలో ప్రాథమిక స్థాయి నుంచే ప్రభుత్వం శిక్షణ ఇవ్వాలి. గ్రామీణ క్రీడాకారుల పట్ల మరింత చొరవ చూపాలి. వారిని ప్రోత్సహించాలి. పాఠశాలల స్థాయిలోనే విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి కలిగేలా చేయాలి. రెగ్యులర్ పీఈటీలను నియమించి క్రీడల్లో వారికి సరైన తర్ఫీదు ఇస్తే వారు భవిష్యత్‌లో మంచి క్రీడాకారులుగా తయారవుతారు. ప్రభుత్వం ఈ విషయం గురించి ఆలోచించాలి.

\- మీగడ శివప్రసాద్, జాతీయ కబడ్డీ క్రీడాకారుడు

2025 నాటికి మేడ్చల్-కాళ్లకల్ జాతీయ రహదారి పనులు పూర్తి



మేడ్చల్‌లో నిర్మిస్తున్న వంతెన పనులను పరిశీలిస్తున్న జాతీయ రహదారి ప్రాజెక్ట్ మేనేజర్

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి17: 2025 చివరి నాటికి మేడ్చల్-కాళ్లకల్ జాతీయ రహదారి పనులు పూర్తిచేయాలని జాతీయ రహదారుల ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు అన్నారు. మేడ్చల్‌లో నిర్మిస్తున్న వంతెన పనులను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గుండ్లపోచంపల్లి నుంచి కాళ్లకల్ వరకు రూ.530కోట్లతో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయన్నారు. మేడ్చల్ క్లాసిక్ దాబా వద్ద అతిపెద్ద ఫ్లై ఓవర్ నిర్మిస్తామన్నారు. ప్రస్తుతం చేపడుతున్న పనుల్లో 75పిల్లర్లు, 5 అండర్ పాస్‌లు, ఆరులేన్ల రోడ్డు వెడల్పు 30మీటర్లు ఉంటుందని వివరించారు. హైటెన్షన్ విద్యుత్ లైన్లు, చెట్ల తొలగింపునకు అనుమతులు వచ్చాయన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి ఇంకా 17.7శాతం పనులు జరగాల్సి ఉందన్నారు. అత్వెల్లి-కరీంనగర్ లింక్ రోడ్డు చెరువు తూము వద్ద అండర్‌పాస్ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. మేడ్చల్ ప్రాంతంలో ప్రతీ సంవత్సరం 10 నుంచి 20శాతం ట్రాఫిక్ పెరుగుతోందని, 60ఏళ్ల క్రితం ఈ జాతీయ రహదారి నిర్మించారన్నారు. భవిష్యత్తులో సమీప గ్రామాల ప్రజలు హైవే పైకి ఎక్కకుండా సర్వీసు రోడ్డును ఉపయోగించుకోవాలని సూచించారు.

అంబులెన్స్‌ల రాకపోకలకు సహకరించండి : రాఘవేందర్‌రావు

అంబులెన్స్‌ల రాకపోకలకు ప్రజలు సహకరించాలని ప్రాజెక్ట్ మేనేజర్ రాఘవేందర్‌రావు విజ్ఞప్తి చేశారు. ప్రజావసరాలకు అనుగుణంగా కొన్నిచోట్ల యూ టర్నులను ఏర్పాటు చేశామని, హైవే విస్తరణ పనులు జరుగుతున్నందున తక్కువ వేగంతో వాహనాలు నడపాలని ఆయన తెలిపారు.

బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

యాలాల, ఫిబ్రవరి 17 : విద్యార్థులు మంచిగా చదివి జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మంగమ్మ అన్నారు. శనివారం పాఠశాలలో 9వ తరగతి, ఇంటర్ ఫస్టియర్ విద్యార్థినులు టెన్త్, సెకండియర్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో స్పెషలాఫీసర్ మంగమ్మ మాట్లాడుతూ బాగా చదువుకొని తల్లితండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కోరారు. కార్యక్రమంలో టీచర్లు, విద్యార్థినులు పాల్గొన్నారు.



విద్యార్థినులతో యాలాల కేజీబీవీ ఉపాధ్యాయినులు

రేవంత్.. సంకుచిత వ్యాఖ్యలు మానుకోవాలి

» బీసీల గురించి రాహుల్ మాట్లాడడం విడ్డూరం: కవిత



హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఏర్పాటు తర్వాత చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే(ఎస్‌కేఎస్) వివరాలు ఒకే కుటుంబం దగ్గర ఉన్నాయంటూ సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడడం తగదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇకనైనా సంకుచిత వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని సూచించారు. 2011లో యూపీఏ ప్రభుత్వం రూ.4,500 కోట్ల ఖర్చుతో దేశవ్యాప్తంగా కులగణన చేసినా, నివేదిక మాత్రం బయటపెట్టలేదని దుయ్యబట్టారు. ఆ వివరాలను గాంధీ కుటుంబం దాచిపెట్టుకుందా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఇప్పుడు బీసీల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మొదటి నుంచి బీసీల వ్యతిరేకి అని, గతంలో పార్లమెంట్‌లోనే రాజీవ్‌గాంధీ బీసీలకు వ్యతిరేకంగా మాట్లాడారని ఆరోపించారు. తలా తోకా లేకుండా ప్రవేశపెట్టిన తీర్మానంతో కులగణన ఎలా చేస్తారని నిలదీశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందన్న ఊహాగానాలపై అడిగిన ప్రశ్నకు కవిత ఆచితూచి స్పందించారు. పొత్తు అంశం గురించి చెప్పేంత స్థాయి తనది కాదని పేర్కొన్నారు.

రవాణా శాఖలో భారీగా బదిలీలు

» ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐల బదిలీ

రవాణా శాఖలో ఏళ్ల తరబడి నుంచి ఒకే ప్రాంతంలో పనిచేస్తున్న పలువురు రవాణాశాఖ అధికారులు(ఆర్టీఓ), ఎంవీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయ పైరవీలతో పని చేయాల్సిన కేంద్రానికి బదులుగా లాభదాయకమైన చెక్‌పోస్టుల్లో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌లు, సహాయ మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్‌ల డిప్యూటేషన్‌లను గతవారం ప్రభుత్వం రద్దు చేసింది. తాజాగా రవాణా శాఖలో పూర్తి స్థాయిలో ప్రభుత్వం బదిలీలతో ప్రక్షాళన ప్రారంభించింది. మొట్టమొదటి సారిగా ప్రతీ అధికారి బదిలీ కోసం ప్రత్యేక జీవోను విడుదల చేసింది. ఏడుగురు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌లు, 23 మంది ఆర్టీఓలు, 150 మంది ఎంవీఐలను బదిలీ చేసింది.

గొర్రెల కొనుగోళ్ల బిల్లుల చెల్లింపులో మోసం!

» దర్యాప్తులో దూకుడు పెంచిన ఏసీబీ

» ఏపీ రైతుల స్టేట్‌మెంట్ రికార్డు

ఆంధ్రప్రదేశ్ రైతుల నుంచి గొర్రెల యూనిట్లు కొనుగోలు చేసి వారికి బిల్లులు చెల్లించకుండా దారి మళ్లించిన కేసు దర్యాప్తులో ఏసీబీ దూకుడు పెంచింది. ఎనిమిది మంది రైతులను శనివారం విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. ఏపీకి చెందిన 18 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన 133 యూనిట్ల గొర్రెలకు సంబంధించి రూ.2.8 కోట్లు చెల్లించాల్సి ఉంది. అయితే ఎంతకీ తమ బిల్లు చెల్లింపుకాకపోవడంతో రైతులు పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఆరా తీయగా బిల్లులు మంజూరైనట్లు తెలిసింది. తమ పేరుతో వేరొకరు బిల్లులు తీసుకున్నట్లు తెలియడంతో తాము మోసపోయినట్టు గుర్తించిన బాధితులు గత డిసెంబరులో సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తమ వద్ద కొన్న గొర్రెల యూనిట్లకు డబ్బులు చెల్లించలేదని కాంట్రాక్టర్‌తోపాటు పశుసంవర్ధక శాఖ అధికారులపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. ఈ కేసు ఆధారంగా అవినీతి కోణంలో ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. 8 మంది ఏపీ రైతులను విచారించి స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. కాంట్రాక్టర్ మోహినుద్దీన్, పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్లు రవి కుమార్, కేశవసాయిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

కాంగ్రెస్ గూటికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం?



ఖమ్మం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం బీఆర్ఎస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు త్వరలోనే కాంగ్రెస్‌లో చేరబోతున్నట్టు తెలుస్తోంది. ఈ మేరకు హైదరాబాద్‌లో చర్చలు జరిగినట్లు కాంగ్రెస్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది అసెంబ్లీ నియోకవర్గాలుండగా.. భద్రాచలంలో మాత్రమే బీఆర్ఎస్ విజయం సాధించింది. గతంలో బీఆర్ఎస్‌లోనే ఉన్న తెల్లం వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రస్తుత రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. అయితే భద్రాచలంలో కాంగ్రెస్ నుంచి అప్పటికి సిటింగ్ ఎమ్మెల్యేగా పొదెం వీరయ్య ఉండడంతో తెల్లంకు టికెట్ విషయంలో భరోసా లభించలేదు. అదే సమయంలో బీఆర్ఎస్ నుంచి టికెట్ ఆఫర్ రావడంతో వెంకట్రావు మళ్లీ బీఆర్ఎస్ గూటికి చేరారు. జిల్లాకు చెందిన మంత్రి పొంగులేటి అనుచరుడిగా ఉన్న వెంకట్రావు అసెంబ్లీ ఎన్నికల తర్వాత వెంటనే కాంగ్రెస్‌లో చేరతారని ప్రచారం జరగగా.. ఆయన కొట్టిపారేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధికి రూ.10కోట్లు నిధులు కేటాయించింది. ఆ నిధుల వినియోగంపై జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు అధికారం కల్పించింది. దీనికితోడు త్వరలో మార్కెట్ కమిటీలతో పాటు పలు నియామక కమిటీలకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టబోతోంది. ఈ నేపథ్యంలోనే తెల్లం కాంగ్రెస్ గూటికి చేరేందుకు ఆసక్తి చూపుతున్నట్టు తెలిసింది. జిల్లా మంత్రి పొంగులేటితో పాటు మరో రాష్ట్ర మంత్రితో మంతనాలు సాగించి పార్టీలో చేరేందుకు నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు ముందే వెంకట్రావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకునే అవకాశం ఉందని సమాచారం. అయితే తెల్లం వర్గీయులు మాత్రం తమ ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోనే ఉంటారని, కాంగ్రెస్‌లో చేరే అవకాశం లేదని చెబుతున్నారు.

సీపీఆర్ చేసి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్సై

వీడియో వైరల్ కావడంతో ప్రశంసల వెల్లువ



బాధితుడికి సీపీఆర్ చేస్తున్న ఎస్సై మైబెల్లి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి) : కుటుంబ సమస్యలతో వేదనకు గురైన ఓ వ్యక్తి చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. సమాచారం అందుకున్న ఎస్సై హుటాహుటిన అక్కడికి చేరుకొని బాధితుడికి సీపీఆర్ చేయడంతో అతను ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బెంగాల్‌కు చెందిన సంతోష్ ముఖర్జీ(38) ఇబ్రహీంపట్నంలోని బీఈఎల్ కన్‌స్ట్రక్షన్ సంస్థలో కూలి పని చేస్తున్నాడు. కుటుంబ సమస్యలతో మానసిక వేదనకు గురైన సంతోష్. శనివారం ఉన్నట్టుండి తాను పనిచేసే సంస్థ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతం వైపు వెళ్లాడు. గమనించిన తోటి కూలీలు పోలీసు వాహనంలో అటుగా వచ్చిన ఎస్సై మైబెల్లికి సమాచారమిచ్చారు. వెంటనే స్పందించిన ఎస్సై చుట్టుపక్కల వెతకగా.. సంతోష్ చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. కిందకి దింపి చూసి శ్వాస ఆడటం లేదని తెలిసి సీపీఆర్ చేశారు. కొద్దిసేపటికి బాధితుడు స్పృహలోకి రావడంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడు. కాగా, బాధితుడికి ఎస్సై మైబెల్లి సీపీఆర్ చేస్తున్న వీడియో వైరల్ కావడంతో ఆయన చేసిన పనికి సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

పాల్గొన్న ముఖ్య నేతలు, బీఆర్ఎస్ శ్రేణులు.. ఆటో డ్రైవర్లకు ప్రమాదబీమా పత్రాలు అందజేసిన కేటీఆర్

» 'అతనే ఒక చరిత్ర' పేరిట కేసీఆర్‌పై డాక్యుమెంటరీ ప్రదర్శన

» కేసీఆర్‌కు గవర్నర్, సీఎం రేవంత్, హరీశ్, కేటీఆర్, కవిత శుభాకాంక్షలు



ఆటో డ్రైవర్లకు చెక్కులు అందజేస్తున్న కేటీఆర్

హైదరాబాద్/జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ 70వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం తెలంగాణ భవన్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో 70 కిలోల కేక్‌ను కట్‌చేశారు. అంతకుముందు బీఆర్ఎస్ నేతలతో కలిసి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలంగాణ తల్లి విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పలువురు ఆటో డ్రైవర్లకు రూ.1లక్ష కవరేజీతో కూడిన ప్రమాదబీమా పత్రాలను అందజేశారు. అదేవిధంగా దివ్యాంగులకు వీల్ చైర్లను పంపిణీ చేశారు. రాజకీయం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం, కేసీఆర్ జీవితంలోని ముఖ్యమైన సందర్భాలపై 'అతనే ఒక చరిత్ర' పేరిట సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి తలసాని సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో రూపొందించిన డాక్యుమెంటరీని ప్రదర్శించారు. కేసీఆర్ ఆమరణ దీక్ష విశేషాలను వివరించేలా ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అనంతరం ప్రమాదవశాత్తు మరణించిన 70 మంది బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలకు ప్రమాద బీమా కింద ఒక్కొక్కరికి రూ.2లక్షల చొప్పున మంజూరైన ఆర్థిక సహాయం చెక్కులను మాజీ మంత్రులు తలసాని, మహమూద్ అలీ అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీలు కె.కేశవరావు, బడుగుల లింగయ్య యాదవ్, వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జీహెచ్ఎంసీ మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్‌అలీ, తలసాని, నిరంజన్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, శ్రీనివాస్ గౌడ్, పలువురు పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు. కాగా, కేసీఆర్‌కు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆమె శుభాకాంక్షలు తెలుపుతూ రాసిన లేఖను, పుష్పగుచ్ఛాన్ని గవర్నర్ కార్యాలయ ప్రతినిధి ఒకరు తెలంగాణ భవన్‌లో అందజేశారు. కేసీఆర్‌కు మాజీ మంత్రి హరీశ్‌రావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ స్వాపికుడు, స్వరాష్ట్ర సాధకుడు అని ట్విటర్ వేదికగా కొనియాడారు. కేసీఆర్‌కు జనసేన అధినేత పవన్ కల్యాణ్ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. పోరాట పటిమతో అంచలంచెలుగా ఎదిగిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు.

కేసీఆర్ ప్రతిపక్ష నేత పాత్రను సమర్థంగా పోషించాలి: రేవంత్

అసెంబ్లీ వేదికగా మాజీ సీఎం కేసీఆర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. "40 ఏళ్ల కేంద్ర, రాష్ట్ర రాజకీయాల్లో తనకంటూ పాత్ర పోషించిన కేసీఆర్.. తెలంగాణ పునర్నిర్మాణంలో ప్రతిపక్ష నాయకుడి పాత్రను సమర్థంగా పోషించాలి. భగవంతుడు ఆయనకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలి' సీఎం రేవంత్ ఆకాంక్షించారు.

ఎర్రవల్లిలో ఆయుష్య హోమం

కేసీఆర్ 70వ జన్మదినం సందర్భంగా శనివారం ఆయన దత్తత గ్రామమైన సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలో మాజీ సర్పంచ్ భాగ్యబాల్‌రాజు ఆధ్వర్యంలో ఆయుష్య హోమం నిర్వహించారు. ఉదయం రంగనాయకస్వామి ఆలయంలో కేసీఆర్ పేరున అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో పండ్లు పంపిణీ చేశారు. మరోవైపు.. కేసీఆర్ తన జన్మదిన వేడుకలను ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో నిరాడంబరంగా జరుపుకొన్నారు. శనివారం ఉదయం మాజీ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవిత, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రానికి వచ్చి కేసీఆర్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డిపై అవిశ్వాసం

» కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే బీఆర్ఎస్ ప్రతిపాదన

» వికారాబాద్ అదనపు కలెక్టర్‌కు తీర్మాన ప్రతి అందజేత

వికారాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతామహేందర్‌రెడ్డిపై బీఆర్ఎస్ జడ్పీటీసీ సభ్యులు అవిశ్వాసం ప్రకటించారు. మొత్తం 12 మంది జడ్పీటీసీలు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం ప్రకటిస్తూ సంతకాలు చేసిన తీర్మాన పత్రాన్ని శనివారం జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌కు అందజేశారు. కాంగ్రెస్‌లో చేరిన మరుసటి రోజే వ్యూహాత్మకంగా వికారాబాద్, తాండూరు మాజీ ఎమ్మెల్యేలు మెతుకు ఆనంద్, రోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ జడ్పీటీసీలు సునీతపై అవిశ్వాసం ప్రకటించారు. ఈ తీర్మానంపై బీఆర్ఎస్ జడ్పీటీసీలు జడ్పీ వైస్ చైర్మన్ బైండ్ల విజయకుమార్(మోమిన్‌పేట), కె.నాగిరెడ్డి(దోమ), కె.మహిపాల్(దౌల్తాబాద్), ఎం.మేఘమాల(పూడూరు), కె.సుజాత (ధారూరు), కె.జయమ్మ(నవాబుపేట), నాగరాణి(కొడంగల్), హరిప్రియ(పరిగి), మంజుల(తాండూరు), ప్రమోదిని(వికారాబాద్), పి.మధుకర్(మర్పల్లి), కె.రాందాస్(కులకచర్ల) సంతకాలు చేశారు. అవిశ్వాస తీర్మానం అందజేసిన 15 రోజుల్లో అధికారులు నోటీసులు జారీ చేయాల్సి ఉంటుంది. అయితే, ఈ అంశంలో అధికారులు ఏ విధంగా వ్యవహరించనున్నారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. ప్రస్తుతం వికారాబాద్ జిల్లా పరిషత్‌లో బీఆర్ఎస్‌కు 14మంది సభ్యులు ఉండగా, కాంగ్రెస్‌కు నలుగురు సభ్యులు ఉన్నారు. కాంగ్రెస్‌లో చేరిన సునీతా మహేందర్‌రెడ్డి బేషరతుగా చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేయాలని జడ్పీ వైస్ చైర్‌పర్సన్ బైండ్ల విజయ్‌కుమార్ డిమాండ్‌చేశారు. రాజీనామా చేయకుండానే ఆమె పార్టీ మారడాన్ని ఖండిస్తూ అవిశ్వాసం ప్రకటించామన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి సైతం తన పదవికి రాజీనామా చేసిన తర్వాతే కాంగ్రెస్‌లో చేరాలని సూచించారు. బీఆర్ఎస్‌లో చేరినప్పుడు ఏమి ఆశించి వచ్చారో... అదే ఆశించి ఇప్పుడు కాంగ్రెస్‌లోకి వెళ్లారని విమర్శించారు. పట్నం దంపతులకు పదవీ వ్యామోహమే తప్ప.. ప్రజలపై ప్రేమ లేదని దుయ్యబట్టారు.

హరీష్‌రావు చెప్పేవన్నీ అబద్ధాలే

● మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి

ఘట్‌కేసర్, ఫిబ్రవరి 17 : అసెంబ్లీలో మాజీ మంత్రి హరీష్‌రావు చెప్పేవన్నీ అబద్ధాలేనని, మాటలు వింటుంటే ఒల్లు జలదరిస్తున్నదని మాజీ ఎమ్మెల్యే కొమ్మిడి నర్సింహారెడ్డి ఆరోపించారు. మాజీ సీఎం కేసీఆర్ ఇంజనీర్ అవతారమెత్తి ప్రజాధనాన్ని వృథా చేశారు కానీ బీడు భూములకు నీటిని అందించలేదని ఆయన విమర్శించారు. భువనగిరి శనివారం పోచారం సంస్కృతి టౌన్‌షిప్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మేడిగడ్డ ప్రాజెక్టును మరింత దిగువన కట్టి ఎత్తిపోతల పేరుతో ప్రజా ధనాన్ని వథా చేసిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల ఒక్క మెదక్ జిల్లాకు తప్ప రాష్ట్రంలోని అన్ని జిలాల్లకు తీరని అన్యాయం జరిగిందని తెలిపారు.

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు

వికారాబాద్, ఫిబ్రవరి 17 : ట్రాన్స్‌జెండర్లు 2019 చట్టం ప్రకారం గుర్తింపు కార్డులను పొందాలని జిల్లా ముఖ్య న్యాయ సహాయాధికారి వెంకటేశ్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ పి రాము అన్నారు. శనివారం వికారాబాద్ మండల సమైక్య కార్యాలయంలో మహిళ, శిశు, వికలాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ సాధికారితశాఖ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డుల గురించి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో ట్రాన్స్‌జెండర్లకు ఎలాంటి వివక్ష కలిగినా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. మహిళా సాధికారత కేంద్రం ట్రాన్స్‌జెండర్ స్పెషలిస్ట్ వరలక్ష్మీ, బాబు, ట్రాన్స్‌జెండర్ అధ్యక్షురాలు రమ్యశ్రీ పాల్గొన్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాన్ని సందర్శించిన కేంద్ర బృందం



ఆరోగ్య ఉపకేంద్రంలో ఢిల్లీ బృందం

కులకచర్ల, ఫిబ్రవరి 17 : చౌడాపూర్ మండలంలోని ఆరోగ్య ఉపకేంద్రాన్ని జాతీయ ఆరోగ్య నాణ్యత ప్రమాణాల బృందం సభ్యులు శనివారం సందర్శించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిరంలో వైద్య సేవలపై సమీక్ష నిర్వహించారు. ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని ఢిల్లీ బృందం సభ్యులు డాక్టర్ శ్రీరామ్‌మెహంతీ, డాక్టర్ సువర్ణ అబ్బె సూచించారు. డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ జీవరాజ్, కులకచర్ల వైద్యాధికారి వాజిఫుద్దీన్, డాక్టర్ మాధురి, సీహెచ్‌వో చంద్రప్రకాశ్, డాక్టర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

అవిశ్వాసం పెట్టడం సరికాదు

● యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి నిఖిల్ రెడ్డి

వికారాబాద్, ఫిబ్రవరి 17 : వికారాబాద్ జడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీత మహేందర్‌రెడ్డిపై అవిశ్వాసం పెట్టడం సరికాదని యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి నిఖిల్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆమె బీఆర్ఎస్ పార్టీ ఇమేజ్‌తో గెలవలేదనే విషయాన్ని ఆ పార్టీ నేతలు గ్రహించాలని, పదవీ కాలాన్ని పూర్తిచేసుకుంటారని చెప్పారు.

గత ప్రభుత్వంలో ఉమ్మడి జిల్లాకు తీవ్ర అన్యాయం

● పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి



ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, ఫిబ్రవరి 17 : బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు తీవ్ర అన్యాయం చేసిందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. శనివారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. చేవెళ్లప్రాణహిత ప్రాజెక్టును అప్పటి సీఎం వైఎస్ఆర్ పరిగి వరకు పొడిగించేందుకు కృషి చేశారని చెప్పారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ద్వారా సాగునీరు వచ్చే విధంగా కృషి చేశారని గుర్తుచేశారు. ఈ రెండు ప్రాజెక్టుల ద్వారా అప్పటి సీఎం కేసీఆర్ ఉమ్మడి జిల్లాకు సాగునీరు రాకుండా చేశారని విమర్శించారు. సాగునీరు కోసం తాను పాదయాత్ర చేస్తే ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో వికారాబాద్‌కు వచ్చిన అప్పటి మంత్రి హరీశ్వరావు ఎందుకు పాదయాత్ర చేస్తావు..? ప్రాజెక్టు నిర్మిస్తామని చెప్పారని రామ్మోహన్‌రెడ్డి గుర్తు చేశారు. అడ్వాన్స్‌ల పేరిట నిధుల వాడుకుంటున్నట్లు నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని రామ్మోహన్‌రెడ్డి మాజీ మంత్రి హరీష్‌రావుకు సవాల్ చేశారు. పాలమూరు ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని సీఎంను కోరారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు



కాంగ్రెస్‌లో చేరిన కార్పొరేటర్లు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 17 : అవిశ్వాసం సమయంలో ఇబ్రహీంపట్నం మున్సిపల్ చైర్‌పర్సన్ కప్పరి స్రవంతికి మద్దతుగా నిలిచిన ఇద్దరు బీఆర్ఎస్ కౌన్సిలర్లు శనివారం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. 24వ వార్డు కౌన్సిలర్ జెర్కోని బాల్‌రాజ్, 10వ వార్డు కౌన్సిలర్ పి.శంకరయ్య కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. శంకరయ్య కాంగ్రెస్ నుంచి కౌన్సిలర్‌గా గెలుపొందారు. ఆరు నెలల క్రితం బీఆర్ఎస్‌లో చేరగా.. తిరిగి ఈరోజు సొంత గూటికి చేరుకున్నారు. కాంగ్రెస్ పార్టీలోనే అన్ని వర్గాలకు సముచిత గౌరవం లభిస్తుందని, సీఎం రేవంత్‌రెడ్డి ఆ దిశగా ముందుకు పోతున్నందునే తాము పార్టీలో చేరామని బాల్‌రాజ్, శంకరయ్య తెలిపారు. వీరి వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, నాయకులు ఈసీ శేఖర్‌గౌడ్, బర్ల జగదీశ్వర్ యాదవ్ తదితరులు ఉన్నారు.

అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే క్రిమినల్ కేసులు

● అక్రమ రవాణాను అడ్డుకునేందుకు మొబైల్ టీంలు

● బషీరాబాద్ తహసీల్దార్ వెంకటేష్



తహసీల్దార్

బషీరాబాద్, ఫిబ్రవరి 17 : అభివృద్ధి పనుల పేరిట ఎవరైనా అక్రమంగా ఇసుక దోపిడీకి పాల్పడితే ఉపేక్షించేది లేదని, క్రిమినల్ కేసులు పెడతామని బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్ హెచ్చరించారు. ఆంధ్రజ్యోతి జిల్లా ఎడిషన్‌లో 'కాగ్నానదిలో ఇసుకను కొల్లగొడుతున్న అక్రమార్కులు' అని శనివారం ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో మొబైల్ టీం ఏర్పాటు చేసి ఇసుక రవాణాను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని నవాంద్గీ శివారులో ఇసుక రీచ్ నుంచి ప్రభుత్వ పనులకు ఇసుక రవాణాకు అనుమతులిస్తున్నమన్నారు. ఇంకెక్కడి నుంచైనా అనుమతి లేకుండా ఇసుకను తరలించే ప్రయత్నం చేస్తే ఊరుకునేదిలేదన్నారు. నిర్ణీత వ్యవధి దాటిన తర్వాత కూడా ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరలించే అనుమతి ఉందని చెప్పారు. దానిపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. ఇందర్‌చెడ్, గంగ్వార్, జీవన్గి వద్ద కూడా ప్రత్యేక దృష్టి పెట్టి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకుంటామని వెల్లడించారు.

మహేశ్వరంలో మారుతున్న రాజకీయ సమీకరణాలు

● త్వరలో కాంగ్రెస్‌లోకి మాజీ ఎమ్మెల్యే తీగల?

● రంగారెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం, ఫిబ్రవరి 17 : మహేశ్వరం నియోజకవర్గంలోని రాజకీయ పరిణామాలు రోజురోజుకూ ఎవరు ఊహించని రీతిలో మారుతున్నాయి. నియోజకవర్గంలోని మీర్‌పేట, బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్లతో పాటు తుక్కుగూడ, జల్‌పల్లి మున్సిపాలిటీల్లోని పలువురు కార్పొరేటర్లు ఇప్పటికే కాంగ్రెస్‌లో తీర్థం పుచ్చుకోగా.. తుక్కుగూడ మున్సిపాలిటీలోని పలువురు కౌన్సిలర్లు కూడా ఆ పార్టీలో చేరేందుకు సిద్ధమయ్యారన్న వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే మహేశ్వరం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన పలువురు మాజీ ప్రజాప్రతినిధులు పాటు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అదే విధంగా మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, ఆయన కోడలు రంగారెడ్డి జిల్లా ప్రస్తుత చైర్ పర్సన్ డాక్టర్ తీగల అనితాహరినాథ్‌రెడ్డి లు తమ అనుచరులతో త్వరలో కాంగ్రెస్‌లో చేరేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకున్నారని ప్రచారం సాగుతోంది. మాజీ ఎమ్మెల్యే తీగల స్వగ్రామమైన మీర్‌పేటలోని టికేఆర్ కళాశాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భారీ బహిరంగసభ ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీలో చేరే ఆలోచనలో తీగల కుటుంబం యోచిస్తోంది. వారితో పాటు నియోజకవర్గంలోని పలువురు బీఆర్ఎస్ ముఖ్య నాయకులుకూడా కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో చేవెళ్ల ఎంపీ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందన్న పలు సర్వేల ఆధారంగా బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్‌వైపు వెళ్లేలా చేస్తుందనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి.

తాళం వేసి ఉన్న ఇళ్లే లక్ష్యంగా దొంగతనాలు

● అంతర్ జిల్లా దొంగ అరెస్ట్

● 30 తులాల బంగారం, కేజీ వెండి, మూడు బైక్‌లు స్వాధీనం : ఎస్పీ కోటిరెడ్డి



ఆభరణాలను చూపిస్తున్న ఎస్పీ

వికారాబాద్, ఫిబ్రవరి 17 : తాళం వేసి ఉన్న ఇళ్లనే లక్ష్యంగా చేసుకొని దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగను వికారాబాద్ పోలీసులు అరెస్టు చేసి బంగారం, వెండి, నగదు, బైకులు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ కోటిరెడ్డి తెలిపారు. నిందితుడి వద్ద నుంచి మూడు బైకులు, 30.3 తులాల బంగారు, 1.40 కేజీల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. శనివారం సీసీఎస్ పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లా కరక్కాయల గూడెం గ్రామానికి చెందిన సన్నిది ఆంజనేయులు మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగించేవాడని, సులభంగా డబ్బు సంపాదించాలనుకున్న ఆంజనేయులు కొంత కాలంగా తాళాలు వేసిన ఇళ్లలో దొంగతనాలు చేస్తూ జీవనం సాగిస్తున్నాడని చెప్పారు. ఈ నెల 7న నవాబ్‌పేట్ మండలం వట్టిమీనేపల్లి గ్రామంలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో 60 వేల నగదు, బంగారు, వెండి ఆభరణాలు దొంగలించి, వాటిని వికారాబాద్‌లో అమ్మడానికి వస్తుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డాడని, పోలీసులకు అనుమానం వచ్చి ఆంజనేయులును విచారించి అతనిపై గతంలో 36 కేసులు ఉన్నట్లు గుర్తించారని తెలిపారు. గత డిసెంబర్ 11న వికారాబాద్ పట్టణంలోని అస్సాం బేకరీ దగ్గరలో ఓ ఇల్లు తాళం వేసి ఉండటాన్ని గమనించి తాళాన్ని పగులగొట్టి బంగారం, ఆభరణాలు దొంగలించాడని తెలిపారు. వీటితో పాటు వికారాబాద్ లో ఒక కేసు, కోదాడలో నాలుగు కేసులు ఉన్నట్లు గుర్తించి తాజాగా ఆరు కేసుల్లో అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. అంతర్ జిల్లా దొంగను పట్టుకోవడానికి కృషిచేసి పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులు ప్రకటించారు. డీఎస్పీ అంజయ్య, సీసీఎస్ సీఐ బల్వంతయ్య, మోమిన్ పేట సీఐ ఆంజనేయులు, నవాబుపేట సీఐ శ్రీను ఎస్సై భరత్‌భూషణ్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక కొరతతో నిలిచిన ఎన్ఆర్ఈజీఎస్ పనులు

తాండూరు, ఫిబ్రవరి 17 : తాండూరు తహసీల్దార్ కార్యాలయంలో ఇసుక పర్మిట్ల బుక్కుల కొరత కారణంగా నాలుగు రోజులుగా ఎన్ఆర్ఈజీఎస్ పనులు నిలిచిపోయాయి. మండలంలో ఖాంజాపూర్ రీచ్‌ను ఇసుక తరలించేందుకు పాయింట్‌గా గుర్తించారు. పర్మిట్ బుక్కులను డీఆర్డీఏ కార్యాలయం నుంచి తెప్పించుకోవాలి. అవసరాన్ని బట్టి రెవెన్యూ అధికారులు నామ మాత్రం బుక్కులు తెప్పించి మూడు రోజుల పాటు పర్మిట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఎన్ఆర్ఈజీఎస్ నుంచి తాండూరుకు రూ.13 కోట్ల నిధులు మంజూరయ్యాయి. మార్చి 15లోపు ఈ పనులు చేపడితే బిల్లులు వస్తాయి. ఆర్థిక సంవత్సరం ముగిస్తే నిధులు రావడానికి మరో ఏడాది పడుతుంది. పార్లమెంట్ ఎన్నిలక కోడ్ వస్తే పనులను ఆపాల్సి వస్తుంది. పనులను త్వరగా చేయించాలనే తపన అధికారులలో లేదని, పర్మిట్లు లేకుండా ఇసుక తరలిస్తే పోలీసులు కేసులు పెడుతారని పలువురు వపోతున్నారు. కరీంనగర్, నిజామాబాద్ నుంచి వచ్చే ఇసుక కూడ వివిధ కారణాలతో తాండూరుకు రావడం లేదు. ఇదిలా ఉండగా పర్మిట్ బుక్కుల కొరత ఉందనే విషయాన్ని సిబ్బంది తన దృష్టికి తీసుకు రాలేదని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు చెప్పారు.

అక్రమ నిర్మాణంపై విచారణ

తాండూరురూరల్, ఫిబ్రవరి 17 : మండలంలోని అంతారంలో చేపట్టిన ఓ అనుమతి లేని నిర్మాణంపై డీఎల్పీవో శంకర్‌నాయక్ విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన ఎత్తరి కృష్ణయ్య గ్రామానికి సరఫరా అయ్యే తాగునీటి పైప్‌లైన్‌పై తన ఇంటి మెట్లు నిర్మించి, పైప్‌లైన్ పక్కనే మరుగుదొడ్డి కోసం రింగులు వేయడంతో గ్రామస్థులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్పీవో శనివారం అంతారం గ్రామంలో విచారణ జరిపారు. గ్రామస్తులతో మాట్లాడారు. ఈ నిర్మాణాలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని పంచాయతీ కార్యదర్శి ఇస్మాయిల్‌ను ప్రశ్నించారు. మరుగుదొడ్డిపై నిర్మాణంతో పాటు, ఇతర వివరాలు సేకరించారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

వీరుల త్యాగాలతోనే మనకు విముక్తి

● మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు



మాట్లాడుతున్న విద్యాసాగర్ రావు

వికారాబాద్, ఫిబ్రవరి 17 : వీరుల త్యాగాలతోనే మనకు విముక్తి కలిగిందని మహారాష్ట్ర మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగర్‌రావు అన్నారు. శనివారం స్థానిక సత్యభారతి ఫంక్షన్‌హాల్‌లో హారతి ద్వారకానాథ్ రచించిన హైదరాబాద్ సంస్థాన విమోచనానికి, ప్రాంతీయ బోధనకు పునాదులు వేసిన తెలంగాణ దార్శనికులు అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధులను ప్రతి ఒక్కరు గౌరవించాలని అన్నారు. గతంలో ఎంతో మంది హైదరాబాద్ విమోచనకు సంబంధించిన పుస్తకాలు రాసినా.. ఇది వాటికి భిన్నమైనదని హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి అన్నారు. నిజాం పాలకులు ప్రాంతీయ భాషను ప్రోత్సహించలేదని, విద్యారంగంలో ఉర్దూకు పెద్ద పీట వేశారని పుస్తక రచయిత ద్వారకనాథ్ చెప్పారు. అనంతరం ద్వారకానాథ్‌ను సన్మానించారు.

మధ్యాహ్న భోజనానికి ముక్కిన బియ్యం

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 17 : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం సరఫరా చేస్తున్న బియ్యం నెలల తరబడి నిల్వ ఉండటంతో ముక్కి పోతున్న సంఘటన ఫరూఖ్‌నగర్ మండలం విఠ్యాల ఉన్నత పాఠశాలలో జరిగింది. శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశం ఉండటంతో తల్లిదండ్రులు హాజరై పాఠశాలలోని బియ్యాన్ని పరిశీలించారు. అవి ముక్కి పోవడంతో ఉపాధ్యాయులను ప్రశ్నించారు. తమ పాఠశాలలో బియ్యం స్టాక్ లేకపోవడంతో రాయికల్ పాఠశాల నంచి తీసుకువచ్చామని ప్రధానోపాధ్యాయుడు రవికుమార్ బదులిచ్చారు. ఆ బియ్యం ఉండలు కట్టాయని చెప్పారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

- కేకులు కట్‌చేసిన ప్రజాప్రతినిధులు, నాయకులు
- ఆస్పత్రుల్లో రోగులకు పండ్లు పంపిణీ



ఆమనగల్లు : కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అర్జున్‌రావు

ఆమనగల్లు/తలకొండపల్లి, ఫిబ్రవరి 17: బీఆర్ఎస్ అధినేత మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు ఆమనగల్లు పట్టణంలోని బస్టాండ్ ఎదుట శనివారం అట్టహాసంగా నిర్వహించారు. స్థానిక బస్టాండ్ ఎదుట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు అర్జున్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. బాణాసంచా పేల్చి కేక్ కట్ చేశారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పలు చోట్ల మొక్కలు నాటారు. జడ్పీటీసీ అనురాధ పత్యానాయక్, మాజీ మార్కెట్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు పత్యానాయక్, నాయకులు తదితరులున్నారు. తలకొండపల్లి మండలం వెల్జాలలో నిర్వహించిన వేడుకలకు జిల్లా సీనియర్ నాయకుడు సీఎల్ శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు. నాయకులతో కలిసి కేక్‌కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. జడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు ముజుబుర్ రహెమాన్, నాయకులు నరేందర్‌గౌడ్, శ్రీకాంత్ యాదవ్, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ : కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్ పలు పాఠశాలల్లో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. కేసీఆర్ నిండు నూరేళ్లు సంపూర్ణ ఆయురారోగ్యాలతో ఉండాలని అంజయ్య ఆకాంక్షించారు. మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులున్నారు.

శంషాబాద్ : కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు వెంకటేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో మున్సిపల్ కేంద్రంలో నిర్వహించారు. చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డితో పాటు పలువురు కౌన్సిలర్లు నాయకులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కేక్ కట్‌చేసి పంచిపెట్టారు.



చేవెళ్ల : ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య, తదితరులు

మహేశ్వరం : మహేశ్వరం మండల కేంద్రంతో పాటు తుక్కుగూడ మున్సిపల్ పరిధిలో కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో నాయకులు కేక్ కట్‌చేశారు. ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎ. రాజునాయక్, చంద్రయ్య, వెంకటేశ్వరెడ్డి, కృష్ణ, సప్పిడిరాజు, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : అంధుల ఆశ్రమంలో కేక్ కట్ చేస్తున్న నాయకులు

కందుకూరు : మండల కేంద్రంలో మండల శాఖ అధ్యక్షుడు జయేందర్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలు నిర్వహించారు. జడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ డి.చంద్రశేఖర్, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీలు రాములు, ఇందిరదేవేందర్, తదితరులున్నారు.



కందుకూరు : కేక్ కట్‌చేస్తున్న జంగారెడ్డి, సురేందర్ రెడ్డి, జమేందర్‌ముదిరాజ్, డి.చంద్రశేఖర్

ఇబ్రహీంపట్నం : కేసీఆర్ జన్మదినం సందర్భంగా ఇబ్రహీంపట్నం సమీపంలోని వినోభానగర్ అంధుల ఆశ్రమం స్ఫూర్తిజ్యోతి ఫౌండేషన్‌లో బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు కేక్ కట్‌చేసి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటి సీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బీఆర్ఎస్వీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పి.రాజ్‌కుమార్, బీఆర్ఎస్ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జెర్కోని రాజు, నాయకులు వినోద్, శివ, వీరేష్, ఖాజు మహ్మద్, కరుణాకర్ తదితరులున్నారు. ఇబ్రహీంపట్నంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో కేక్ కట్‌చేసి కేసీఆర్ జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. మండలాధ్యక్షుడు బుగ్గరాములు, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, బీఆర్ఎస్ విద్యార్థి విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు జగదీశ్వర్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : కేసీఆర్ జన్మదిన వేడుకలను మున్సిపాలిటీలో మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ శశిధర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేశారు. చంద్రమౌళి, శ్రీనాథ్‌గౌడ్, అశోక్, ఇంద్రసేనారెడ్డి, రాంరెడ్డి, వాసుదేవ్‌కన్నా, ఫరీద్, రాంమ్మోహన్, గోపాల్, ప్రవీణ్‌కుమార్, మధు, తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమించిన మహానాయకుడు కేసీఆర్ అని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. కేసీఆర్ జన్మదినం పురస్కరించుకుని బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజాప్రతినిధులతో కలిసి యాదయ్య కేక్ కట్ చేశారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మండలాధ్యక్షుడు ప్రభాకర్, జెడ్పీటీసీ మాలతిరెడ్డి, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, వైస్‌ఎంపీపీ శివప్రసాద్, ఎంపీటీసీ సత్యనారాయణచారి, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ నర్సింలు, మాజీ డైరెక్టర్ వెంకటేశ్‌ముదిరాజ్, మాజీ ఎంపీటీసీ ఎల్లయ్య, నాయకులు మర్పల్లి కృష్ణరెడ్డి, రవీందర్, నరేందర్‌గౌడ్, కృష్ణ, తదితరులున్నారు.



షాద్‌నగర్ : ఫరూక్‌నగర్ జడ్పీహెచ్ఎస్(బాలికలు)లో ప్యాడ్లు అందజేస్తున్న నటరాజన్, పక్కన అంజయ్య

చౌదరిగూడ : జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సయ్యద్ హఫీజ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలిపారు. జబ్బార్, రాంచంద్రయ్య, బాబురావు, యాదయ్య, వెంకటేష్, మల్లేష్, చెన్నయ్య, సన్ని, అజ్మీరీ జబ్బార్ తదితరులున్నారు.

కేశంపేట : బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి నేతృత్వంలో కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంపీపీ రవీందర్ యాదవ్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్తపేట ఎంపీటీసీ మల్లేష్‌యాదవ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మీనారాయణగౌడ్, యాదయ్యచారి, శేఖర్ పంతులు, నవీన్ కుమార్, తలసాని వెంకట్ రెడ్డి, నారాయణరెడ్డి, ఆంజనేయులు, యాదగిరి, లక్ష్మయ్య, బాల్‌రాజ్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కొందుర్గు : కేసీఆర్ జన్మదిన వేడుకలను మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో నాయకులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. వైస్ ఎంపీపీ రాజేష్‌పటేల్, నాయకులు జగదీశ్వర్ గౌడ్, రాజా రమేష్ రెడ్డి, కె.యాదగిరి, చంద్రశేఖర్, సున్నాల శ్రీనివాస్, ప్రభాకర్, రమేష్, వాసురి, ప్రేమ్‌కుమార్, రాజు గౌడ్, అంజయ్య, లింగం గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



శంషాబాద్ : వేడుకల్లో నాయకులు, తదితరులు

క్రైం కార్నర్

వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి

నందిగామ సమీపంలో రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..

నందిగామ, ఫిబ్రవరి 17: వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతిచెందారు. రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం నందిగామ మండల కేంద్రానికి సమీపంలోని బ్రహ్మంగారి దేవాలయం పక్కన రైల్వేట్రాక్‌పై శనివారం గుర్తుతెలియని రైలు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందినట్లు రైల్వేపోలీస్ శ్రీనివాస్ తెలిపారు. మృతదేహాన్ని షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. మృతదేహంపై బూడిద కలర్ పాయింట్ ఉంది. వయస్సు 50-55 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. పాయింట్ జేబులో ఈనెల 13వ తేదీన తీసుకున్న బెంగుళూరు నుంచి తిరుపతి వెళ్లే బస్సు టికెట్ ఉంది. సమాచారం కొరకు షాద్‌నగర్ రైల్వేపోలీస్‌లను సంప్రదించాలన్నారు.

ఆటో బోల్తాపడిన ఘటనలో మరొకరు

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 17 : ఆటో బోల్తాపడిన ఘటనలో వ్యక్తి మృతి చెందాడు. శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రమాదం చోటు చేసుకుంది. మహబూబాబాద్‌కు చెందిన పులి సారయ్య(60) శంకర్‌పల్లిలో నివాసం ఉంటూ కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం కంది గ్రామంలో పనికి వెళ్లి తిరిగి ట్రాలీ ఆటోలో వస్తున్నాడు. మున్సిపాలిటీ పరిధిలోని సింగాపురం సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. దాంతో సారయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న అతడి భార్య వనమ్మ, కూతురు స్వరూపకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మరో వ్యక్తి ..

శంకర్‌పల్లి : మున్సిపాలిటీ పరిధిలోని ఫత్తేపూర్ వార్డులో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఫత్తేపూర్‌కు చెందిన రవీందర్(30) శుక్రవారం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. శనివారం ఫత్తేపూర్ వంతెన కింద గల గ్యాస్ పైప్ లైన్ గుంతలో శవమై కనిపించాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ క్షతగాత్రుడు

నందిగామ, ఫిబ్రవరి 17: ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. ఈ నెల 15న నందిగామ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రాయన్‌గూడ సమీపం పాత జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి బోల్తాపడడంతో షాద్‌నగర్‌కు చెందిన వజీర్ తీవ్రంగా గాయపడ్డాడు. కారులో షాద్‌నగర్ నుంచి నగరానికి వెళ్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి చంద్రాయన్‌గూడ సమీపంలోని పాత జాతీయ రహదారిపై బోల్తాపడింది. వజీర్‌కు తీవ్ర గాయాలు కావడంతో నగరంలోని ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందినట్లు ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు.

పట్టుబడిన మద్యం బాటిళ్లు ధ్వంసం

ఆమనగల్లు, ఫిబ్రవరి 17: ఆమనగల్లు మండలంలో గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పట్టుబడిన మద్యం బాటిళ్లను శనివారం పోలీసులు ధ్వంసం చేశారు. అక్రమంగా నిల్వ ఉంచిన, విక్రయించిన మద్యాన్ని ఎన్నికల సందర్భంగా పోలీసులు పట్టుకున్నారు. సీఎఫ్ఎస్ఎల్ నివేదికల ఆధారంగా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ మద్యం డెస్ట్రాయ్‌కి అనుమతి ఇచ్చారు. దాంతో ఎస్సై బాల్‌రామ్‌నాయక్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆమనగల్లు పట్టణ సమీపంలో బాటిళ్లను ధ్వంసం చేశారు.

ఆన్‌లైన్‌లో బెట్టింగ్.. ఇద్దరు అరెస్ట్

- రూ.లక్షా 60వేలు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం

ఆదిభట్ల, ఫిబ్రవరి 17 : గుర్రపు పందేలపై ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి రూ.1,60,000, మూడు ఫోన్లు స్వాధీనం చేసుకున్న ఘటన ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ పరిధి రాగన్నగూడలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం రాగన్నగూడ ఎస్వీఆర్ టౌన్‌షిప్‌లో ఇద్దరు వ్యక్తులు ఆన్‌లైన్‌లో గుర్రపు పందేల బెట్టింగ్‌లకు పాల్పడుతున్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి వెళ్లాగా.. బడిగ రామకృష్ణ, అల్వాల కమలాకర్‌లు బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. వారిని అదుపులోకి తీసుకొని రూ.లక్షా60వేలు నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'కులగణన' చరిత్రాత్మక నిర్ణయం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్/చౌదరిగూడ, ఫిబ్రవరి 17 : తెలంగాణలో కుల గణన చేపట్టడమనేది చరిత్రాత్మక నిర్ణయమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చిన 72 ఏళ్ల తర్వాత బీసీలు, బీసీ ఉపకులాలకు న్యాయం జరిగే రోజులు వచ్చాయని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం రేవంత్‌రెడ్డి బీసీలు ఆర్థిక, రాజకీయ, సామాజికంగా ఎదిగేందుకు కులగణన అంశాన్ని శాసనసభలో ప్రవేశపెట్టడం, ఏకగ్రీవ తీర్మానం చేయడం అభినందనీయమన్నారు. బీసీ కులగణన అనంతరం అత్యంత వెనుకబడిన సంచార జాతులకు ఆర్థిక, రాజకీయ రంగాల్లో అత్యంత ప్రాధాన్యతనివ్వాలని కోరారు. అన్ని రాజకీయ పార్టీలు కూడా బీసీలకు రాజకీయపరంగా మొదటి ప్రాధాన్యత కల్పించాలని సూచించారు. దేశంలోనే బీసీ కులగణన చేపట్టిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు.

ప్రణాళికతో చదివితే విజయం మీదే

విద్యార్థులు ప్రణాళికబద్ధంగా చదివితే ఎలాంటి పరిక్షలో అయినా విజయం తథ్యమని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అందె మోహన్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను అందజేశారు.

సీఎం రేవంత్, ఎమ్మెల్యే చిత్రపటానికి పాలాభిషేకం

బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కుటుంబ సర్వేతో పాటు కులగణన చేపడుతున్నట్లు అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సీఎం, ఎమ్మెల్యే వీర్లపల్లి చిత్రపటాలకు కాంగ్రెస్ శ్రేణులు పాలాభిషేకం చేశారు. మండలాధ్యక్షుడు రాజు, బీసీసెల్ తాలుకా అధ్యక్షుడు చంద్రశేఖర్, మాజీ సర్పంచులు యాదయ్య, బాల్‌రాజ్, వెంకట్‌నర్సింహ్మారెడ్డి, సలీం, జంగయ్య, అన్వర్, నవీన్‌గౌడ్, వెంకటయ్య, నర్సింలు, లింగం, సలాం తదితరులు పాల్గొన్నారు.

సామాజిక విలువలతో కూడిన విద్యనందించాలి



తల్లిదండ్రులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

ఆదిభట్ల, ఫిబ్రవరి 17 : పిల్లలకు సంస్కారం, సామాజిక విలువలతో కూడిన విద్యనందించాలని, ఆ దిశగా తమ సంస్థ నిరంతరం కృషి చేస్తుందని శ్రీ చైతన్య విద్యాసంస్థల ఏజీఎం సతీష్ అన్నారు. ఆదిభట్లలోని శ్రీచైతన్య క్యాంపస్‌లో శనివారం స్మార్ట్ లివింగ్ కార్యక్రమంలో భాగంగా ఫ్యామిలీ గ్లోరీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు పాదపూజ చేసి వారి నుంచి ఆశీర్వాదం తీసుకున్నారు. శ్రీచైతన్య విద్యాసంస్థ ఆర్ఐలు వెంకట్‌రెడ్డి, రవిందర్‌రెడ్డి, జోనల్ అకడమిక్ కో-ఆర్డినేటర్లు రఘువంశీ, జితేందర్, డీన్ పుల్లారావు, మహిపాల్, సాయికుమార్, ప్రిన్సిపల్ బి.సతీష్, వైస్ ప్రిన్సిపల్ హాస్టల్ ఇన్‌చార్జులు రమేష్, సుధాకర్, కళ్యాణ్‌గోపి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

ఆమనగల్లు, ఫిబ్రవరి 17: మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో శ్రీ అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కనుల పండువగా కొనసాగుతున్నాయి. వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వస్తున్నారు. శనివారం చక్రతీర్థం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ ఎగిరిశెట్టి గోదాదేవిసత్యం, చైర్మన్ శ్రీనివాస్, ట్రస్టీ కోట్ల జగన్‌మోహన్, అర్చకులు, పెద్దఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు.

దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదం

తలకొండపల్లి : దైవ కార్యక్రమాలు సమాజ శాంతికి దోహదపడుతాయని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మండలంలోని వెల్జాలలో గల శ్రీ వేదాద్రి గుట్టపై గల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మార్చి 5 నుంచి 7వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై శనివారం సన్నాహక సమావేశం నిర్వహించారు. ధర్మకర్త గూడ శ్రీనివాసమూర్తి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై చర్చించి పలు తీర్మానాలు చేశారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించి కరపత్రాలు, పోస్టర్లను ఆలయ నిర్వాహకులతో కలిసి శ్రీనివాస్ యాదవ్ ఆవిష్కరించారు. ధర్మకర్త శ్రీనివాసమూర్తి, ఎంపీటీసీ అంబాజీ, మాజీ ఉప సర్పంచ్ అజీజ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గురుస్వామి సతీషన్ నాయర్ మృతిపట్ల సంతాపం



కేశంపేట : సతీషన్ నాయర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అయ్యప్ప భక్తమండలి సభ్యులు

షాద్‌నగర్/కేశంపేట/శంషాబాద్/కొత్తూర్, ఫిబ్రవరి 17 : అయ్యప్ప స్వామిభక్తుడు, నియోజకవర్గ సుపరిచితుడు గురుస్వామి సతీషన్‌నాయర్ శనివారం అనారోగ్యంతో హైదారాబాద్‌లో తుదిశ్వాస విడిచారు. ఆయన మృతి పట్ల ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సంతాపం ప్రకటించారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ మాలధారణం.. నియమాల తోరణం అంటూ షాద్‌నగర్ నియోజకవర్గంలో అయ్యప్పస్వామి బోధనలు వినిపించి ఎంతోమందిని మాలధారణ చేయించి యువతను వక్రమార్గం నుంచి సన్మార్గంలో నడిపించిన వ్యక్తి అని కొనియాడారు. ఆయన మృతి అయ్యప్ప భక్తులనే కాకుండా నియోజకవర్గ ప్రజలను ఎంతగానో దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. సతీషన్ నాయర్ కేశంపేట అయ్యప్ప భక్త మండలి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గురుస్వామి చిత్రపటాన్ని ఏర్పాటుచేసి, పూల మాలలతో నివాళులర్పించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వీరేశ్, యెన్నం శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అలాగే శంషాబాద్‌లోని అయ్యప్పసేవా సంఘం సభ్యులు నివాళులర్పించారు. నాయర్ మృతి అయ్యప్ప భక్తులకు తీరని లోటని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.దేవేందర్‌యాదవ్ అన్నారు. కొత్తూర్ చౌరస్తాలో అయ్యప్ప భక్తులతో పాటు, బీఆర్ఎస్ నాయకులు ఆయన చిత్రపటాన్ని ఏర్పాటు చేసి నివాళులర్పించారు. మున్సిపాలిటీతో పాటు, ఆయా గ్రామాల్లో అయ్యప్ప భక్తులు సతీషన్‌నాయక్ చిత్రపటాలను ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించి, అయ్యప్పభక్తులకు సతీషన్‌నాయర్ చేసిన సేవలను కొనియాడారు. కౌన్సిలర్ నర్సింహాగౌడ్, కొడిచర్ల ఎంపీటీసీ బి. రవీందర్‌రెడ్డి, అయ్యప్ప భక్త కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

భయం వీడి ఏకాగ్రతతో చదవాలి

కడ్తాల్, ఫిబ్రవరి 17: విద్యార్థులు పరీక్షల వేళ భయం వీడి ఏకాగ్రత, పట్టుదలతో చదువుతూ ముందుకు సాగితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని ఎంపీటీసీల సంఘం ఫోరం జిల్లా గౌరవాధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల పదోతరగతి విద్యార్థినిలకు శనివారం పాఠశాల ఆవరణలో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్పొరేట్, ప్రైవేట్‌కు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు చొరవ తీసుకోవాలన్నారు. పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన విద్యార్థులకు రూ.5 వేల చొప్పున ప్రోత్సాహక నగదు అందజేస్తానని తెలిపారు.


ఎమ్మెల్యే సబితారెడ్డిని కలిసిన కందుకూరు ఎంపీడీవో



కందుకూరు, ఫిబ్రవరి 17 : ఇటీవల కందుకూరు ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన బి.సరిత శనివారం మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి కలిశారు. నగరంలోని ఎమ్మెల్యే నివాసానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుడా పనిచేయాలని సూచించినట్లు ఎంపీడీవో చెప్పారు.

చేవెళ్ల నూతన ఏసీపీకి సీపీఐ నాయకుల సన్మానం

చేవెళ్ల, ఫిబ్రవరి 17 : చేవెళ్ల నూతన ఏసీపీగా బాధ్యతలు స్వీకరించిన బంటు కిషన్‌ను సీపీఐ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శనివారం సాయంత్రం ఏసీపీని కలిసి ఘనంగా సత్కరించి పూలబొకే అందజేశారు. ఏసీపీని కలిసిన వారిలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు రామస్వామి, చేవెళ్ల, మొయినాబాద్ మండలాల కార్యదర్శులు సత్తిరెడ్డి, శ్రీనివాస్, మండల మహిళా అధ్యక్షురాలు మంజుల, నాయకులు సత్యనారాయణ తదితరులున్నారు.



జేఈఈ మెయిన్స్‌లో షాబాద్ మోడల్ కళాశాల విద్యార్థిని ప్రతిభ



కె.రాధిక

షాబాద్, ఫిబ్రవరి 17 : జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్‌లో మండలంలోని మోడల్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇంటర్మీడియట్ సెకండియర్ విద్యార్థిని కె.రాధిక(ఎంపీసీ) జేఈఈ మెయిన్స్ మొదటి సెషన్ పరీక్షలో ప్రతిభ కనబర్చింది. ఈమేరకు జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ వాచ్య తెలిపారు. శనివారం రాధికను అధ్యాపకులు, తోటి విద్యార్థులు అభినందించారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

షాబాద్, ఫిబ్రవరి 17 : విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నతులుగా ఎదగాలని షాబాద్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వాచ్యానాయక్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో వెల్‌స్పన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. ఫౌండేషన్ జీఎం సురేఖ, ప్రాజెక్టు మేనేజర్ భద్రయ్య, ఉపాధ్యాయులు, తదితరులున్నారు.

విద్యార్థుల మేధా సంపత్తిని పెంపొందించాలి

- వైస్ ఎంపీపీ రాజేష్ పటేల్

కొందుర్గు, ఫిబ్రవరి 17: చిన్నారి విద్యార్థుల్లో మేధా సంపత్తిని పెంపొందించాలని వైస్‌ఎంపీపీ రాజేష్ పటేల్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని న్యూ గీతాంజలి పాఠశాలలో సైన్స్‌ఫేర్ నిర్వహించారు. వైస్ ఎంపీపీ హాజరై మాట్లాడుతూ క్రియాత్మక పద్ధతి ద్వారా విద్యార్థులు స్వయంగా చేసిన ప్రయోగాలు వారికి జీవితాంతం గుర్తుంటాయని, ప్రయోగాల ద్వారా విద్యార్థుల్లో ఆలోచన శక్తి పెరుగుతుందన్నారు.

గుండెపోటుతో చైన్‌మన్(వీఆర్ఏ) మృతి



ఈశ్వరయ్య (ఫైల్)

కందుకూరు, ఫిబ్రవరి 17 : గుండెపోటుతో కొత్తూరు గ్రామ చైన్‌మన్(వీఆర్ఏ) మేళ్ల ఈశ్వరయ్య శనివారం ఉదయం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ కె.గోపాల్, డీటీ తాజుద్దీన్, ఆర్ఐ ప్రేమ్‌కుమార్‌లు గ్రామానికి వెళ్లి ఈశ్వరయ్య కుటుంబ సభ్యులను ఓదార్చారు. 30 ఏళ్లుగా గ్రామ కావలికారుగా బాధ్యతలు చేపట్టిన ఈశ్వరయ్య ఇటీవల చైన్‌మన్‌గా పదోన్నతి పొందారు. శనివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ సర్పంచ్ వసంతకృష్ణగౌడ్, తహసీల్దార్ కార్యాలయం జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్, సిబ్బంది శ్రీకాంత్, శ్రీనివాస్, శంకర్ తదితరులున్నారు.

మెరుగైన వసతుల కల్పనే ధ్యేయం : ఎంపీపీ

ఆమనగల్లు, ఫిబ్రవరి 17: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వసతుల కల్పనే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ అనితవిజయ్ అన్నారు. మండలంలోని మేడిగడ్డలో మండల పరిషత్, ఈజీఎస్ నిధుల నుంచి రూ.12.10 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణం పనులను శనివారం స్థానిక నాయకులతో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. ఆమనగల్లు మండలంలో 13 సీసీ రోడ్ల నిర్మాణానికి ఈజీఎస్ ద్వారా రూ.65 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యదర్శి వెంకటయ్య, మాజీ ఉప సర్పంచ్ మల్లేశ్ నాయక్, విజయ్‌రాథోడ్, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ



విజేతలతో టోర్నమెంట్ నిర్వాహకులు

ఆమనగల్లు, ఫిబ్రవరి 17 : మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న మూడవ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఘనంగా ముగిసాయి. పురుషులు, స్త్రీలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. పాఠశాల స్థాయి విభాగాల్లో విజేతలకు జిల్లా కాంగ్రెస్ నాయకులు సత్యం, మాజీ సర్పంచ్ గోదాదేవీలు ప్రథమ బహుమతిగా నగదు రూ.20,116లు, ద్వితీయ బహుమతి రూ.10.116లు మూడవ బహుమతి రూ.5.116లు అందించారు. బాలుర విభాగంలో కడ్తాల, ఆకుతోటపల్లి, నాదర్‌గుల్, బాలికల విభాగంలో బాలానగర్ ఉన్నత పాఠశాల, కల్వకుర్తి గురుకుల పాఠశాల, ఆమనగల్లు విశ్వభారతి పాఠశాలలకు చెందిన క్రీడాకారులు బహుమతులందుకున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రావు, మాజీ సర్పంచ్ కృష్ణయ్య, మాజీ ఉప సర్పంచ్ వెంకటయ్య, నాయకులు తదితరులున్నారు.

'లైంగికదాడి' ఘటనపై ఏబీవీపీ భగ్గు

- కళాశాల ఎదుట ధర్నా

శంషాబాద్, ఫిబ్రవరి 17 : లైంగికదాడికి పాల్పడిన లెక్చరర్ పనిచేసే కళాశాల ఎదుట.. శనివారం ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు ఆందోళన చేపట్టారు. సూర్యదీప్ అనే వ్యక్తి శంషాబాద్‌లోని ఓ కళాశాలలో పని చేస్తున్నాడు. అదే కళాశాలలో చదువుతున్న మైనర్ విద్యార్థినికి మాయమాటలు చెప్పి లైంగికదాడికి పాల్పడిన విషయం తెలిసిందే. పోలీసులు అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే, ఆ కళాశాలను మూసివేయాలని, లెక్చరర్‌ను కఠినంగా శిక్షించాలని నినాదాలు చేస్తే ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు కళాశాల ఎదుట బైటాయించి ధర్నాకు దిగారు. పోలీసులు అక్కడికి చేరుకొని నిందితుడిని జైలుకు పంపామని, చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పి ఆందోళన చేస్తున్న విద్యార్థులను సముదాయించారు. నాయకుడు ప్రదీప్‌తో పాటు మరో 19మందిని అరెస్టు చేశామని సీఐ బాల్‌రాజ్ తెలిపారు.



ఆందోళన చేస్తున్న నాయకులు, విద్యార్థులను సముదాయిస్తున్న పోలీసులు

సంక్షిప్తంగా..

- **ఆదిభట్ల :** పిల్లల్లో రేచీకటి రాకుండా విటమిన్ ఏ ద్రావణాన్ని శనివారం ఆదిభట్ల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు తాగించారు. ప్రతీ ఆరు నెలలకు ఒకసారి విటమిన్ ఏ సిరప్‌ను వేయడం వల్ల రేచీకటి రాకుండా ఉంటుందని హెచ్ఎం పరమేష్ తెలిపారు.
- **మహేశ్వరం :** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్ర విద్యాపరిశోధనా శిక్షణమండలి ఆదేశానుసారం మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన మండలస్థాయి సైన్స్ టాలెంట్ టెస్టులో మోడల్‌స్కూల్ విద్యార్థిని జె.సింధు మొదటి స్థానం సంపాదించగా తుమ్మలూరు ఉన్నత పాఠశాలకు చెందిన పల్లవి రెండవ స్థానం సంపాదించింది. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ ధనుంజయ్ మాట్లాడుతూ ఫిబ్రవరి 28 వ తేదీన జరగబోయే జాతీయ సైన్స్ డేను పురస్కరించుకొని మహేశ్వరంలో నిర్వహించిన టాలెంట్ టెస్టులో మోడల్ స్కూల్ విద్యార్థిని మొదటి స్థానంలో నిలవడం అభినందనీయయమని ఆయన అన్నారు.
- **ఆమనగల్లు :** ఆమనగల్లు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ఈనెల 19న ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ పీఆర్‌వో పాష తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో ఎనుగొండ రాంరెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి, ఆమనగల్లు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.
- **కేశంపేట :** స్వయం పాలనతో విద్యార్థులలో నాయకత్వలక్షణాలు పెంపొందుతాయని కేశంపేట మండల ఇన్‌చార్జి ఎంఈవో మనోహర్ తెలిపారు. మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట హైస్కూల్‌లో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.
- **చౌదరిగూడ :** జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని పెద్ద ఎల్కిచర్ల ఉన్నత పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు తోటి విద్యార్థులకు విద్యను బోధించడం సంతోషంగా ఉందని విద్యార్థులు అన్నారు. ఇన్‌చార్జి హెచ్ఎం సత్యంతోపాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
- **కడ్తాల్ :** కొండ్రిగాని బోడు తండా, పెద్దిరెడ్డి చెరువు తండాలలో సీసీరోడ్ల నిర్మాణం పనులను కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ స్థానిక నాయకులతో కలిసి పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.10 లక్షలు మంజూరయ్యాయి.

ఉద్యోగ ధర్మాన్ని అంకితభావంతో నిర్వర్తించాలి

కడ్తాల, ఫిబ్రవరి 17 : పట్టుదలతో ముందుకు సాగి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన పేదింటి బిడ్డలు ఉద్యోగ ధర్మాన్ని అంకిత భావంతో నిర్వర్తించి సమాజంలో స్ఫూర్తిదాయకంగా నిలువాలని కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ చైర్మన్ లీలాలక్ష్మారెడ్డి కోరారు. అన్మాస్‌పల్లి ది హెల్త్ సెంటర్‌లో ఎస్‌జేఆర్ సంస్థ, సీజీఆర్ పర్యావరణ సంస్థల ఆధ్వర్యంలో శిఖర ఐఏఎస్ అకాడమీ సహకారంతో ఏడాది పాటు ఉచిత శిక్షణ పొంది పోలీసుకానిస్టేబుల్స్, గురుకుల పాఠశాలలకు ఫిజికల్ డైరెక్టర్లుగా నియమితులైన అభ్యర్థులకు శనివారం అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర మాజీ మంత్రి సూదిని జైపాల్ రెడ్డి సోదరులు పద్మారెడ్డి, సూదిని మనోహర్‌రెడ్డి, కుమారులు ఆనంద్‌రెడ్డి, అరవింద్‌రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. శిఖర అకాడమి డైరెక్టర్ దీపికారెడ్డి, సీజీఆర్ ప్రతినిధులు ఉమామహేశ్వర్ రెడ్డి, వెంకటేశ్, ఎస్‌జేఆర్ సంస్థ ప్రతినిధి రజనీకాంత్‌లతో కలిసి ఉద్యోగాలు సాధించిన 11 మందికి ప్రశంస పత్రాలు అందజేసి సత్కరించి అభినందించారు.